సాక్షి ఒడిశా

ఆదివారం । 13 । ఏప్రిల్ । 2025



పట్టాభిషేక వైభవం
జయపురంలో శ్రీరామ పట్టాభిషేకం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు భారీగా తరలివచ్చి శోభయాత్రగా వెళ్లారు.
- 8లో



మహనీయుల జీవితం ఆదర్శం
పర్లాకిమిడిలో ఒడిశా సాహిత్య అకాడమీ, జిల్లా అధికారుల ఆధ్వర్యంలో ప్రముఖుల జీవిత చరిత్రపై సదస్సు నిర్వహించారు.
- 8లో



కవులకు సత్కారం
మల్కన్‌గిరి జిల్లాలో ఒడియా పక్షోత్సవంలో భాగంగా శనివారం కవితా పఠనం నిర్వహించారు. 40 మంది కవులను సన్మానించారు .
- 8లో

చైత్రోత్సవ సందడి



పూలు, పండ్ల అలంకరణలో అమ్మవారు



ఘటాలకు అలంకరణ



సంప్రదాయ పూజల్లో కమిటీ సభ్యులు



లలితా పారాయణం చేస్తున్న మహిళలు

రాయగడ మజ్జిగౌరి అమ్మవారి చైత్రోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ప్రాంగణంలో కొలువైన ఘటాలకు ప్రత్యేకంగా అలంకరణ చేశారు. సూర్యపూజలు, హోమం జరిపించారు. మహిళలు లలిత పారాయణ చేశారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆదివారం ఉదయం అమ్మవారి పాదాల గుడి వద్ద పాదాలను యథావిధిగా నిలపడంతో ఉత్సవాలు పూర్తవుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. – రాయగడ



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

న్యూస్‌రీల్

జింకకు తప్పిన ముప్పు



జింకను రక్షించిన గ్రామస్తులు

పర్లాకిమిడి : దాహార్తిని తీర్చుకునేందుకు అటవీ ప్రాంతం నుంచి గ్రామాల వైపు వస్తున్న జంతువులు కొన్నిసార్లు వీధి కుక్కల దాడుల్లో గాయపడుతున్నాయి. గుసాని సమితి ఏడో మైలు వద్ద కోర్సండ గ్రామంలో శనివారం ఉదయం 9 గంటల సమయంలో ఓ జింక ప్రవేశించడంతో వీధి కుక్కలు వెంటాడాయి. వెంటనే స్థానికులు గుర్తించి జింకను రక్షించి అటవీ అధికారులకు ఫోన్ చేసి అప్పగించారు. అటవీ శాఖ రేంజ్ అధికారి గణేష్ గ్రామానికి చేరుకుని జింకను ప్రాథమిక చికిత్స చేయడానికి పర్లాకిమిడి తీసుకెళ్లారు.

ఘనంగా హనుమాన్ జయంతి పూజలు



పర్లాకిమిడి: స్వామి వారికి పూజలు చేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని స్థానిక కోమటివీధిలోని వేంకటేశ్వర స్వామి మందిరంలో ప్రత్యేక పూజలు జరిగాయి. భద్రం శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పూజలు జరిపారు. పర్లాకిమిడిలో సోమవారం ఒడియా ప్రజలు హనుమాన్ జయంతిని జరుపుకుంటుండగా, మంగళవారం కూడా జరుపుకోవచ్చని శ్రీనివాసాచార్యులు తెలియజేశారు.

ఇసుక అక్రమ రవాణాపై చర్యలు



పోలీసులు స్వాధీనం చేసుకున్న టిప్పర్లు

రాయగడ: ఇసుక అక్రమ రవాణాపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. గుణుపూర్‌లో గత బుధవారం వంశధార నది నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు టిప్పర్లను పోలీసులు పట్టుకున్నారు. అనంతరం జిల్లా మైనింగ్ అధికారులకు సమాచారం అందించడంతో శుక్రవారం మైనింగ్ విభాగాధికారులు గుణుపూర్ వెళ్లారు. అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసి టిప్పర్ల యజమానులకు రూ.1.35 లక్షల జరిమానా విధించారు.

శాకంబరిగా ముత్యాలమ్మ



ముత్యాలమ్మ తల్లి

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ముత్యాలమ్మ అమ్మవారి జాతరలో భాగంగా శనివారం ఉదయం అమ్మవారు శాకంబరి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సాయంత్రం నిజ రూప దర్శనంలో అమ్మవారు దర్శనమిచ్చారు.

వరకట్నం కోసం వేధిస్తున్నారు..

- పోలీసులకు వివాహిత ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు తల్లి, పిల్లలతో కలిసి వెళ్తున్న కల్పన

రాయగడ: వరకట్నం తీసుకురావాలంటూ తన అత్తమామలు వేధిస్తున్నారని, నిండు గర్భిణిగా ఉన్న తనపై దాడి చేస్తున్నారని ఓ మహిళ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఘటన జిల్లాలోని రామనగుడలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గుడారి సమితిలోని శిరిగుడ గ్రామానికి చెందిన లక్ష్మీకాంత్ పతికా కుమార్తె కల్పనకు రామనగుడ సమితి పరిధిలోని గోగుపాడు పంచాయతీలోని జర్లింగి గ్రామానికి చెందిన పంచానన్ లిమ్మ కొడుకు సామనాథ్ లిమ్మతో తొమ్మిదేళ్ల క్రితం ప్రేమ వివాహం జరిగింది. వీరికి ఆరేళ్ల కొడుకు, మూడేళ్ల కూతురు ఉన్నారు. ఈ క్రమంలో కల్పన మరోసారి గర్భం దాల్చింది. మూడో సంతానం వద్దని.. వెంటనే గర్భస్రావం చేయించుకోవాలని అత్తమామలు కోడలను తరచూ వేధిస్తుండేవారు. భర్త లేని సమయంలో కల్పనను అనేక విధాలుగా హింసిస్తుండేవారు. ఈ విషయాన్ని తన భర్త సామనాథ్‌కు చెప్పినా వారి మాటలు పట్టించుకోవద్దని భార్యకు నచ్చజెబుతుండేవాడు. ఇదే అదనుగా తీసుకున్న అత్తమామలు కల్పనను కట్నం తీసుకురావాలని వేధిస్తుండేవారు. ఈ క్రమంలో శుక్రవారం కల్పన భర్త లేని సమయంలో అదనుగా భావించిన కల్పన అత్త సుభాషిణి, మామ లక్ష్మీకాంత్‌లు కల్పనపై దాడి చేశారు. వీరి వేధింపులు భరించలేని కల్పన తన కటుంబీకులకు విషయాన్ని తెలియజేసింది. అనంతరం వారి సహాయంతో శుక్రవారం సాయంత్రం రామనగుడ పోలీస్‌స్టేషన్‌లో తనను వరకట్నం తీసుకురమ్మంటున్నారని, అదేవిధంగా తన గర్భానికి నష్టం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

20న ఘంటసాల ఆరాధనోత్సవాలు



మాట్లాడుతున్న చైతన్య ఆంధ్ర సాహితీ సంస్కృతి సమితి ప్రతినిధులు

పర్లాకిమిడి : చైతన్య ఆంధ్ర సాహితీ సంస్కృతి సమితి ఆధ్వర్యంలో స్థానిక బిజూ కల్యాణ మండపంలో ఈ నెల 20న ఘంటసాల ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ కన్వీనర్ డాక్టర్ సయ్యద్ రహీంతుల్లా తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఘంటసాల అష్టావధానం, మెలోడీ, పాటలు, స్కిట్స్ విశాఖపట్నం, పర్లాకిమిడి కళాకారులు పాల్గొంటారని చెప్పారు. ఉదయం 8 గంటలకు మెగా వైద్య శిబిరం నిర్వహిస్తామని, హృద్రోగులు, షుగర్ వ్యాధిగ్రస్తులకు బీపీ రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేపడతారని తెలిపారు. సాయంత్రం జరిగే ఘంటసాల ఆరాధనోత్సవాలకు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ, ఫిషరీస్ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, సెంచూరియన్ వర్సిటీ ఉపాధ్యక్షులు డి.ఎన్.రావు తదితరులు విచ్చేస్తారని వివరించారు. సమావేశంలో మహిళా చైతన్య అధ్యక్షురాలు కోట్ని శోభారాణి, చైతన్య కార్యదర్శి బి.జనార్దనరావు, సెంచూరియన్ వర్సిటీ జి.ఎం. ఫల్గుణరావు, నానాజీ తదితరులు పాల్గొన్నారు.

అలరిస్తున్న జలపాతం..!



సేద తీరుతున్న పర్యాటకులు

కొరాపుట్: కొరాపుట్ జిల్లా కేంద్రానికి 23 కిలోమీటర్ల దూరంలో ఉన్న పుంజసీల్ జలపాతం జనాలను ఆకర్షిస్తోంది. ఏటవాలు సమాంతరంగా ఉండే ఈ జలపాతం అందరినీ ఆకట్టుకుంటుంది. వేసవి నేపథ్యంలో చాలామంది వాహనదారులపై అక్కడకి వెళ్లి సహజ సౌందర్య జలపాతంలో జలకాలాడుతున్నారు. సహజ సిద్ధమైన కొండల పైనుంచి జాలువారుతున్న నీటిలో స్నానాలు చేస్తూ ఆనందంతో గడుపుతున్నారు.



పుంజసీల్ జలపాతం

సన్మార్గంలో నడవాలి



ప్రవచనం చెబుతున్న సామవేదం షణ్ముఖశర్మ

పర్లాకిమిడి: ప్రతిఒక్కరూ సన్మార్గంలో నడవాలని ఆధ్యాత్మిక ప్రవచనకారుడు సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. నగరంలోని రాజవీధి రామలింగేశ్వర ఆలయంలో శనివారం పాడుగుకోవెల ఆలయ కమిటీ ప్రతినిధి దుర్గాప్రసాద్ దాస్, కన్యకాపరమేశ్వరి ఆలయం అర్చకులు వనమాలి మణిశర్మ, లలితా దేవి ఆలయం భక్తబృందం ఆధ్వర్యంలో సామవేదం షణ్ముఖ శర్మకు సత్కారం చేశారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ శంకరుడు, పార్వతీదేవి, లలితాదేవి అందరూ ఒక్కటేనని చెప్పారు. కార్యక్రమంలో లలితాదేవి భక్త బృందం కమిటీ అధ్యక్షురాలు విశాలాక్ష్మీ అయ్యంగర్, బరాటం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పడి ఇల్లు దగ్ధం



నిరాశ్రయులైన బాధిత కుటుంబ సభ్యులు

జయపురం: కాలవైశాఖి ప్రభావంతో జయపురంలో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. భారీ వర్షాలు, పిడుగులతో జనం భయాందోళనకు గురయ్యారు. శుక్రవారం సాయంత్రం స్థానిక గొడియ మాలి వీధిలో ప్రశాంత్ అనే వ్యక్తి ఇంటిపై పిడుగు పడింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. బాధితుడు సర్వస్వం కోల్పోయి నిరాశ్రయుడయ్యాడు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని స్థానికులు కోరారు.

18 క్వింటాళ్ల ఇప్పపూలు పట్టివేత



స్వాధీనం చేసుకున్న ఇప్పపూల బస్తాలు

మల్కన్‌గిరి: కోరుకొండ సమితి ఎం.వి.53 గ్రామంలో శనివారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించి 18 క్వింటాళ్ల ఇప్పపూలు స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన వికాష్ బాణిక్, హరధన్ బాణిక్‌లను అరెస్టు చేశారు. నాటుసారా తయారీ కోసం ఇప్పపూలు వినియోగిస్తారని పోలీసులు తెలిపారు.

చెరువు కాటేసింది..

- నీట మునిగి ఇద్దరు బాలికలు మృతి



ప్రమీళ దొరాపుటియ మృతదేహం



అమ్రిత పలిగుడియ మృతదేహం

జయపురం: చెరువులో మునిగి ఇద్దరు బాలికలు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాద ఘటన జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితి బలిగాం పంచాయతీ బానుగుడ గ్రామంలో శనివారం ఈ సంఘటన చోటుచేసుకుంది. బానుగుడ గ్రామానికి చెందిన పదలాం దొరాపుటియ కుమార్తె ప్రమీళ దొరాపుటియ (10), అదే గ్రామం పరుశురాం పలిగుడియ కుమార్తె అమ్రిత పలిగుడియ(8)లు స్కూల్‌కు వెళ్లి మధ్యాహ్నం ఇళ్లకు తిరిగి వచ్చారు. పుస్తకాలను ఇంటి దగ్గర పెట్టేసి తండ్రులతో కలసి బానుగుడ గ్రామంలోని చెరువులో స్నానం కోసం వెళ్లారు. వారి తండ్రులు స్నానం చేసి ఏదో పనిపై వెళ్లిపోయారు. వారు వెళ్లిన తరువాత కూడా మరికొంతమంది బాలికలతో కలిసి దొరాపుటియ, పలిగుడియలు స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి పోయారు. ఎంత సేపటికీ వారు బయటకు రాకపోవడంతో మిగతా పిల్లలు ఆందోళనతో వచ్చి గ్రామస్తులకు విషయాన్ని తెలియజేశారు. వెంటనే గ్రామస్తులు వచ్చి చెరువులో గాలించి ఇద్దను బాలికలను బయటకు తీసి.. బలిగాం ప్రాథమిక ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పిల్లలిద్దరూ అప్పటికే మరణించినట్లు ధ్రువీకరించారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదం నెలకుంది. రామగిరి పోలీసులు కేసులు నమోదు చేశారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించిన తరువాత కుటుంబ సభ్యులకు అప్పగించారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



రాయిపై మృతురాలి దుస్తులు

మల్కన్‌గిరి: రేణగబంధు గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో శనివారం సాయంత్రం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. కట్టెలు కోసం వెళ్లిన స్థానికులకు దుర్వాసన రావడంతో ముందుకెళ్లి పరిశీలించగా ఓ మృతదేహం కనిపించింది. వెంటనే మల్కన్‌గిరి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఐఐసీ రీగాన్ కీండో సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహం గుర్తు పట్టని విధంగా మారింది. పక్కనే ఓ రాయిపై నీలం లెగ్గింగ్‌ను గుర్తించారు. మృతురాలు బూడిద రంగు టీ షర్ట్ ధరించి ఉంది. ఆత్మహత్యా లేక లైంగికదాడి చేసి హత్య చేశారా అన్న విషయమై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పర్లాకిమిడిలో చిరుజల్లులు



పర్లాకిమిడి రాజవీధిలో కురుస్తున్న వర్షం

పర్లాకిమిడి: గజపతి జిల్లా గుమ్మా, కాశీనగర్, పర్లాకిమిడిలలో శనివారం సాయంత్రం చిన్నపాటి వర్షం కురిసింది. ఏడు నెలల తరువాత పర్లాకిమిడి పరిసర ప్రాంతాల్లో వర్షం కురవడంతో వాతావరణం చల్లబడి ప్రజలు ఉపశమనం పొందారు.

ఘనంగా హనుమాన్ జయంతి



దైనిక బజారులో అభయాంజనేయ స్వామి



హిమగిరి వీధిలో హనుమాన్ చాలీసా చదువుతున్న బాబూ భాయ్

జయపురం: జయపురంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. దైనిక బజారులో హనుమాన్ విగ్రహానికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. జయపురం హిమగిరి వీధిలోని శ్రీరామ మందిరంలో జరిగిన హనుమాన్ జయంతి వేడుకల్లో ఆర్.ఎస్.ఎస్ నాయకుడు బాబుబాయ్ భజరంగ బలి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పవర్ హౌస్, పూర్ణఘడ్, సాంబారుతోట, డెప్పిగుడ, రఘునాథ్ మందిరం, పాత బస్టాండ్, ప్రైవేట్ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో భక్తుల రద్దీ కనిపించింది.

విజిలెన్స్‌కు చిక్కిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్



పవిత్ర మోహన్ పాణిగ్రాహి



స్వాధీనం చేసుకున్న నగదు, నగలు

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పవిత్రా మోహన్ పాణిగ్రాహి శుక్రవారం రాత్రి విజిలెన్స్ అధికారులకు పట్టుబడ్డారు. తన కారులో చిత్రకొండ నుంచి విధులు ముగించుకొని భువనేశ్వర్ వెళ్తుండగా గోవిందపల్లి వద్ద విజిలెన్స్ పోలీసులు కారు ఆపారు. లోపల తనిఖీలు చేయగా రూ.5లక్షల 7వేలు అక్రమంగా ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కొరాపుట్‌కు తరలించారు. ఇంట్లో సోదాలు చేయగా విలువైన ఆస్తులు, బంగారు గుర్తించారు. అనంతరం కొరాపుట్ విజిలెన్స్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

క్లుప్తంగా

అదుపుతప్పి గుడ్లలారీ బోల్తా



బోల్తాపడిన లారీ

నరసన్నపేట: మండలంలోని జాతీయ రహదారిపై మడపాం వద్ద గుడ్ల లారీ అదుపుతప్పి సర్వీసు రోడ్డులో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ సిబ్బంది స్వల్ప గాయాలతో బయటపడగా, లారీ చాలా వరకు నుజ్జు అయింది. దీంతో గుడ్లకు నష్టం వాటిల్లింది. విజయవాడ నుంచి కోల్‌కతాకు గుడ్లుతో వెళ్తున్న లారీ శనివారం వేకువజామున మెయిన్ రోడ్డు నుంచి అదుపుతప్పి సర్వీసు రోడ్డులో బోల్తా పడింది. ప్రమాదానికి డ్రైవర్ నిద్రమత్తే కారణమని తెలుస్తోంది. అయితే రాత్రి సమయం కావడంతో స్థానికులకు ఎటువంటి ఇబ్బంది కలగలేదు.

గంజాయితో వ్యక్తి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ చిన్నంనాయుడు

ఇచ్ఛాపురం: పట్టణ పరిధిలో 16.330 కేజీల గంజాయితో ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ మీసాల చిన్నంనాయుడు తెలియజేశారు. స్థానిక పోలీసు సీఐ కార్యాలయంలో శనివారం పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ పోలీసులకు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో తనిఖీలు నిర్వహించామన్నారు. ఆ సమయంలో ఒడిశాలోని గజపతి జిల్లా మోహన బ్లాక్ అలిగెండా గ్రామానికి చెందిన బినసెంత బాన్‌సింగ్ అనే వ్యక్తి బ్యాగులో 16.330 కేజీల గంజాయిని తరలిస్తుండగా పట్టుబడ్డాడు. నిందితుడిని విచారించగా అలిగెండా గ్రామానికి చెందిన టోప్పో అనే వ్యక్తి సూచనల మేరకు హైదరాబాద్ తీసుకెళ్లి ఒక వ్యక్తికి అందజేయడానికి తరలిస్తున్నట్లు పేర్కొన్నాడు. నిందితుడి వద్ద నుంచి గంజాయితో పాటు ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి అక్రమ రవాణా జరగకుండా చాకచక్యంగా వ్యవహరించిన ఇచ్ఛాపురం పోలీసులను ఎస్పీ అభినందించారన్నారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ ముకుందరావు, క్రైం సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లకు చెందిన పొన్నాడ గంగారావు శుక్రవారం ఎచ్చెర్ల పాత జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. రోడ్డు దాటుతుండగా శ్రీకాకుళం వైపు బైక్‌పై వెళ్తున్న వ్యక్తి ఢీకొన్నాడు. దీంతో 108 అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రి వైద్య నివేదిక, క్షతగాత్రుని భార్య అన్నపూర్ణ ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేశారు.

కింగ్ కోబ్రా హల్‌చల్



కింగ్ కోబ్రాను పట్టుకున్న నర్సింగ్ మహాపాత్రో

సోంపేట: మండలంలోని కొర్లాం అయ్యప్ప దాబా వద్ద భారీ కింగ్ కోబ్రా శనివారం హల్‌చల్ చేసింది. దీంతో స్థానికులు, దాబా సిబ్బంది భయభ్రాంతులకు గురయ్యారు. అయ్యప్ప దాబా యాజమాన్య సిబ్బంది పాములు పట్టే నర్సింగ్ మహాపాత్రోకు సమాచారం అందజేశారు. మహాపాత్రో పాము ఉన్న స్థలానికి చేరుకుని చాకచక్యంగా పట్టుకున్నాడు. అనంతరం అటవీశాఖ అధికారి జోగారావు సమక్షంలో జలంత్రకోట రిజర్వ్ ఫారెస్టులో విడిచిపెట్టారు.

రైలు నుంచి జారిపడిన మహిళ



గాయపడిన విశ్వాస పాయల్

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్ కూతవేటు దూరంలో శుక్రవారం రాత్రి 11.30 గంటలకు రైలు నుంచి ఒక మహిళ జారి పడిన ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని కలకత్తా నుంచి తమిళనాడు రాష్ట్రం చెన్నై వెళ్తుండగా సూపర్‌ఫాస్ట్ రైలు నుంచి జారిపడింది. విశ్వాస్ పాయల్ అనే మహిళగా గుర్తించిన పలాస 108 సిబ్బంది ప్రథమ చికిత్స అందించారు. అనంతరం పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో పలాస వైద్యులు శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు.

పట్టాభిషేక వైభవం



శాస్త్రోక్తంగా శ్రీరామ పట్టాభిషేకం జరిపిస్తున్న వేద పండితులు



భరత నాట్యంతో అలరించిన కళాకారిణి



స్వామివారి పట్టాభిషేకంలో కార్యదర్శి దంపతులు



శోభాయాత్రగా వెళ్తున్న భక్తులు



ముత్యాల నగలతో పూజారులు



పురవీధులలో శోభాయాత్ర

జయపురంలోని జమాల్ లైన్ శ్రీరామమందిర ప్రాంగణంలో శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా శనివారం శ్రీరామ పట్టాభిషేకం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ పరిచాలన కమిటీ అధ్యక్షుడు గోరుపల్లి నాగరాజు, కార్యదర్శి సానా జగదీష్‌ల నేతృత్వంలో భక్తులు శంఖువు, చక్రాలు, గదలు తీసుకొచ్చేందుకు పూజా కమిటీ అధ్యక్షుడు నాగరాజు ఇంటికి శోభయాత్రగా వెళ్లారు. అనంతరం అర్చకులు ఉలిమిరి నాగేశ్వరరావు, గన్నవరపు కోటి వరప్రసాద శర్మ నేతృత్వంలో కల్యాణం జరిపించారు.
– జయపురం



పట్టాభిషేకానికి వస్తువులు తీసుకొస్తున్న నాగరాజ దంపతులు



శ్రీరామ పట్టాభిషేకంలో నిర్వాహకులు

కరిగిపోతున్న అడవులు!

- మరుభూములుగా మారుతున్న.. గుప్తేశ్వర అటవీ ప్రాంతం!
- పట్టించుకోని అటవీ అధికారులు



చెట్లను కొట్టేయగా మిగిలిన మొదళ్లు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితి గుప్తేశ్వర్ అటవీ రేంజ్‌లో అడవులు మాఫియా పిడికిలో చిక్కుకొని మరుభూమిగా మారుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. దట్టమైన అడవులు గల గుప్తేశ్వర్ ప్రాంతంలో కొంతమంది బరితెగించి విలువైన చెట్లను నరికేసి తరలించుకుపోతున్నారు. దీంతో దట్టమైన అటవీ ప్రాంతం ఉనికిని కోల్పోతుంది. అడవులకు రక్షణ లేకుండా పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుప్తేశ్వర్ ప్రాంతంలో గతంలో అనేక రకాల వృక్షాలు ఉండేవని వాటిని పరిరక్షించేందుకు అటవీ విభాగ సిబ్బంది పర్యవేక్షిస్తుండేవారన్నారు. అయితే ప్రస్తుతం అడవుల పర్యవేక్షణకు తగినంత మంది సిబ్బంది లేరు. దీన్ని అదునుగా చేసుకొని మాఫియా పెట్రేగిపోతోంది. రేయింబవళ్లు తేడాలేకుండా విలువైన చెట్లను నరికేసి కలపను తరలించుకుపోతున్నారు. ప్రధానంగా విలువైన ఔషధ గుణాలు ఉన్న చెట్లు ఇప్పుడు అడవిలో లేకుండా పోయాయి. పోడు వ్యవసాయం కోసం కొంతమంది అడవులకు నిప్పు అంటిస్తూ కాల్చి వేస్తున్నా అటవీ సిబ్బంది నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో గుప్తేశ్వర్ ప్రాంతం మరుభూమిగా మారుతుందా అనే అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అటవీ విభాగ అధికారులు చర్యలు చేపట్టి అడవులను పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.



కొట్టేసిన భారీ వృక్షం



చెట్లను కొట్టేయడంతో ఖాళీగా ఉన్న స్థలం

మహనీయుల జీవితం ఆదర్శం



ఉపాధ్యాయునికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న డీఆర్‌డీఏ అధికారి పృథ్వీరాజ్ మండల్

పర్లాకిమిడి: ఒడిశా భాషా పక్షోత్సవాలు సందర్భంగా ఒడిశా సాహిత్య అకాడమీ, జిల్లా అధికారుల ఆధ్వర్యంలో స్థానిక మహారాజా బాలుర ఉన్నత పాఠశాలలో ప్రముఖుల జీవిత చరిత్రపై పలువురు వక్తలు చర్చించారు. పట్టణంలోని 50 మందికి పైగా వయోవృద్ధులు, ఒడిశా భాష, సాహిత్యం, సంస్కృతిని వివరించారు. పండిత గోపబంధుదాస్, గోదావరి దాస్, పండిత మధుసూదన్ దాస్, సత్యనారాయణ రాజగురు, అప్పన్న పోరిచ్చా, అప్పన్న పాణిగ్రాహి, భక్తకవి జయదేవ్ వంటి మహామహుల జీవిత చరిత్రపై ఉత్కళ హితేషినీ కార్యదర్శి పూర్ణచంద్ర మహాపాత్రో, బినోద్ జెన్నా, ఒడిషా సాహిత్య అకాడమీ, మాజీ సభ్యులు బిచిత్రానంద బెబర్తా తదితరులు వేదికపై మాట్లాడారు. డీఆర్‌డీఏ ముఖ్యకార్య నిర్వాహణ అధికారి శంకర కెరకెటా, సబ్ కలెక్టర్ అనుప్ పండా, డీఆర్‌డీఏ అధికారి పృథ్వీరాజ్ మండల్, జిల్లా సాంస్కృతిక శాఖ అధికారి అర్చనా మంగరాజ్ డాక్టర్ భారతీ పాణిగ్రాహి, తదితరులు పాల్గొన్నారు.

కవులకు సత్కారం

మల్కన్‌గిరి: జిల్లాలో ఒడియా పక్షోత్సవంలో భాగంగా 12వ రోజు శనివారం కవితా పఠనం నిర్వహించారు. స్థానిక డీఎస్‌డీపీ సమావేశ హాల్‌లో పలువురు కవులు కవితలు వినిపించారు. ముఖ్య అతిథులుగా జిల్లా అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రధాన్, జిల్లా అదనపు ఎస్పీ తాపాస్ నారాయణ్ రోతో, జిల్లా సబ్ కలెక్టర్ దూర్యోధన్ బోయి, జిల్లా కవి రత్నకర్ దాస్, ప్రొఫెసర్ రంజాన్ స్వాయి, అధికారులు హాజరయ్యారు. అవిభక్త కోరాపుట్ జిల్లాలైన మల్కన్‌గిరి జిల్లాలోని స్వాతంత్ర సమరయోధులు తమ్మాదొర, లక్ష్మణ్ నాయక్ త్యాగాలను గుర్తు చేసుకున్నారు. 40 మంది కవులను సన్మానించారు . జిల్లా కేంద్రంలో తమ్మదొర విగ్రహాన్ని పెట్టాలని కవులు కోరారు.



సమావేశంలో పాల్గొన్న అతిథులు



కవికి సర్టిఫికెట్ అందజేస్తున్న జిల్లా అదనపు ఎస్పీ తపాస్‌నరాయణ్ రోయో, అధికారులు



సర్టిఫికెట్లు పొందిన కవులతో అతిథులు

ఆఫ్‌షోర్ నిర్వాసితులకు న్యాయం చేస్తాం



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

పలాస: మండలంలోని రేగులపాడు వద్ద ఆఫ్‌షోర్ నిర్మాణానికి భూములిచ్చినవారి త్యాగాలు వెలకట్టలేనివని, నిర్వాసితులకు అన్నివిధాలుగా తగిన న్యాయం చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆఫ్‌షోర్ పనులను పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. పనులు పూర్తయితే సాగునీటితో పాటు పలాస పట్టణ ప్రజలకు తాగునీటి కొరత తీరుతుందన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్ వద్ద మొదటిగా 7 లక్షల క్యూబిక్‌ల మట్టి పని చేయాల్సి ఉందని, పనులకు అందరూ సహకరించాలని కోరారు. డైవర్సన్ రోడ్డు పనులు కూడా చేపడతామన్నారు. ఇంకా నిర్వాసితుల సమస్యలు ఉన్నాయని, ప్యాకేజీలు అందరికీ వచ్చేలా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. నిర్వాసితుల కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఇరిగేషన్ సీఈ రుద్రమనాయుడు, ఎస్ఈ పి.వి.తిరుపతిరావు, ఈఈ శేఖర్‌బాబు, డీఈవీ సుధాకర్, ఆర్డీవో జి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా తెప్పోత్సవం



తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పొందూరు: మండల పరిధిలోని లైదాం శ్రీరామధామంలో సీతారాముల మహాయజ్ఞంలో భాగంగా తెప్పోత్సవం కార్యక్రమం శనివారం రాత్రి 7 గంటలకు కన్నుల పండువగా నిర్వహించారు. తొలుత సీతారామ చంద్రప్రభువుల వారికి రథోత్సవం చేపట్టారు. వారిని పల్లకిలో గ్రామంలో ఊరేగించారు. మహిళలు హారతులు పట్టి పూజలు చేశారు. అనంతరం కొలనులో తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు.

జీవో నంబర్ 35ను సవరణ చేయాలి



మాట్లాడుతున్న కిలారి నారాయణరావు

- ఏపీ పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు కిలారి

అరసవల్లి: రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖలో ఇటీవల తీసుకొచ్చిన జీవో నంబర్ 35ని తక్షణమే సవరించాలని పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు కిలారి నారాయణరావు కోరారు. జిల్లాకేంద్రంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీరాజ్ శాఖలో ప్రభుత్వం తీసుకున్న పాలనా సంస్కరణలను తామంతా స్వాగతిస్తున్నామన్నారు. అయితే జీవో నంబర్ 35తో జిల్లా పరిషత్, మండల పరిషత్‌లలో పరిపాలనాధికారులుగా పనిచేస్తున్నవారికి ఎంపీడీవోలుగా పదోన్నతుల కోటాలో తీరని అన్యాయం జరుగుతుందన్నారు. గతంలో ఎంపీడీవోలుగా పదోన్నతుల్లో జెడ్పీ, మండల పరిషత్ ఉద్యోగులకు 34 శాతం, పంచాయతీ విస్తరణాధికారి (ఇవోపీఆర్డీ)లకు 33 శాతం, అలాగే డైరెక్ట్ నియామకాలకు 30 శాతం, ఇతరులకు 3 శాతం చొప్పున కేటాయింపు ఉండేదని గుర్తు చేశారు.

34 శాతం కేటాయింపు దారుణం

ప్రస్తుతం ఎంపీడీవోల పోస్టులకు డైరెక్ట్ నియామకాలను ప్రభుత్వం రద్దుచేసి, పదోన్నతులతో భర్తీ చేస్తామని ప్రకటించింది. దీంతో ఈ లెక్కన జిల్లా పరిషత్, మండల పరిషత్ ఉద్యోగుల క్యాడర్ స్ట్రెంత్ ప్రకారం పదోన్నతుల కోటా 50 శాతం వరకు తమకే కేటాయింపులు ఇవ్వాల్సి ఉందని కిలారి నారాయణరావు అన్నారు. కానీ ప్రభుత్వం మాత్రం 34 శాతం మాత్రమే కేటాయిస్తున్నట్లుగా ప్రస్తావిస్తూ జీవో విడుదల చేయడం దారుణమన్నారు. ఇప్పటికైనా జిల్లా పరిషత్, మండల పరిషత్ క్యాడర్ స్ట్రెంత్‌ను దృష్టిలో పెట్టుకుని తమకు పదోన్నతుల్లో 50 శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణమే జీవో సవరించాలని విజ్ఞప్తి చేస్తున్నామని, లేదంటే రాష్ట్ర కమిటీ మార్గదర్శకాల ప్రకారం భవిష్యత్ కార్యాచరణకు సిద్ధమవుతామని ప్రకటించారు. సమావేశంలో జిల్లా సంఘ ప్రధాన కార్యదర్శి కింజరాపు నర్సింహమూర్తి, జిల్లా మహిళ ఉద్యోగుల సంఘ అధ్యక్షురాలు పి.జయమ్మ, జెడ్పీ యూనిట్ ప్రతినిధి మాసపు సంతోష్‌కుమార్, రాష్ట్ర సంఘ ప్రతినిధులు కె.మురళీకృష్ణ పట్నాయక్, సీపాన రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

చిక్కోలుకు వన్నెతెచ్చిన 'గాయకుడు ఆనంద్'



ఆనంద్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం జిల్లాకు వన్నె తెచ్చిన వ్యక్తి సినీ గాయకుడు జి.ఆనంద్ అని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక బాపూజీ కళామందిర్ ప్రాంగణంలో ఘంటసాల, బాలు, జి.ఆనంద్ (జీబీఏ) స్వరమాధురి వెల్ఫేర్ అండ్ సర్వీస్ సొసైటీ, ఆనంద్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆనంద్ విగ్రహాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విగ్రహాన్ని రూపొందించిన శిల్పి దివిలి హేమచందర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, గొండు స్వాతి, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, డాక్టర్ నిక్కు అప్పన్న, గేదెల వీర్రాజు, వావిలపల్లి జగన్నాథం నాయుడు, డోల జగన్, ఎం.వి.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

- భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహరావు



మాట్లాడుతున్న నాయకుడు నర్సింహరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వి.నర్సింహరావు కోరారు. శ్రీకాకుళం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి పెండింగ్ క్లెయిమ్స్ పరిష్కరిస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ అమలు చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలైనా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు అమలు చేయడానికి పూనుకోకపోవడం దారుణమన్నారు. కార్మిక వర్గాన్ని నమ్మించి మోసగించడం పాలకులకు పరిపాటిగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో మీనమేషాలు లెక్కిస్తోందని, భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారంలో జాప్యం చేస్తోందని విమర్శించారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమ పథకాల అమలు కోసం ఉద్దేశించి వసూలు చేసిన సెస్ నిధులను, కార్మికుల సంక్షేమానికే ఖర్చు చేయాలని సూచించారు. ప్రభుత్వాలు వివిధ సందర్భాల్లో అక్రమంగా తీసుకున్న వెల్ఫేర్ బోర్డు నిధులను తక్షణమే తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. అర్హులైన భవన నిర్మాణ కార్మికులకు గృహ నిర్మాణాల వెల్ఫేర్ బోర్డు ద్వారా సబ్సిడీతో కూడిన రుణం ఇప్పించాలన్నారు. కార్మికుల పిల్లలకు స్కాలర్ షిప్ అందించాలని, పనిచేసే ప్రదేశాల్లో కనీస మౌలిక సదుపాయలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. నిర్మాణాల్లో ఉపయోగించే వస్తువులపై (ముడి సరుకులు) జీఎస్టీ తగ్గించాలని విన్నవించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వం తీరుకు నిరసనగా, భవన నిర్మాణ కార్మిక సంఘం, సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈనెల 24వ తేదీన కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు తెలియజేశారు. అన్ని మండలాల్లోని నిర్మాణ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహరావు, ఏపీ బిల్డింగ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.హరనాథరావు, గౌరవాధ్యక్షుడు ఎం.ఆదినారాయణమూర్తి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పైడితల్లి చండీయాగం



వనంగుడిలో చండీయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు జన్మ నక్షత్రమైన మూలా నక్షత్రం పురస్కరించుకుని శనివారం చదురుగుడి, వనంగుడి ఆలయ ప్రాంగణంలో చండీయాగం ప్రక్రియను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు సాయికిరణ్, దూసి శివప్రసాద్, వెలువలపల్లి నరసింహమూర్తి, తాతా రాజేష్‌లు యాగప్రక్రియను నిర్వహించి, యాగ విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం అమ్మవారి శేష వస్త్రాలను, ప్రసాదాలను భక్తులకు అందజేశారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ కెఎన్‌వి డివి.ప్రసాద్ పర్యవేక్షించారు.

అమ్మవారికి గోరింటాకుతో అర్చన



గోరింటాకు అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు

విజయనగరం టౌన్: నగరంలోని సిటీ బస్టాండ్ వద్దనున్న అభయాంజనేయస్వామి ఆలయంలో కొలువైన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు వికె.గాయత్రీ శర్మ ఆధ్వర్యంలో శనివారం గోరింటాకుతో అర్చనలు నిర్వహించారు. చైత్ర మాస పౌర్ణమి పురస్కరించుకుని అమ్మవారికి సహస్ర కుంకుమార్చనలు, నక్షత్ర హారతులు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



మృతుడు నాని

గంట్యాడ: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా బొందిగామ మండలం అలమండ గ్రామానికి చెందిన అలిబిల్లి నాని(20) విజయనగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం తనతో పాటు మరో ఐదుగురు స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనాలపై గంట్యాడ మండలం తాటిపూడి రిసార్ట్‌కు పికినిక్‌కు వెళ్లారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో అక్కడ నుంచి బయలుదేరి విజయనగరం వస్తుండగా గింజేరు దాటిన తర్వాత గ్రీన్ ఫీల్డ్ హైవే గ్రిల్స్‌ను ఢీకొట్టడంతో నానితో పాటు బైక్‌పై వెనుక కూర్చొన్న వంశీకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరిని అంబులెన్సులో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. నాని అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుడికి తల్లిదండ్రులు, సోదరి ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇంచార్జ్ ఎస్‌ఐ అశోక్‌కుమార్ తెలిపారు.

కళ్లల్లో కారం కొట్టి పుస్తెలతాడు అపహరణ



పోలీసుస్టేషన్ వద్ద దిగాలుగా బాధిత మహిళ

రాజాం సిటీ: పట్టపగలు మహిళ కళ్లల్లో కారంకొట్టి పుస్తెలతాడు అపహరించుకుపోయిన ఘటన మండల పరిధి పొగిరి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన జడ్డు చిన్నమ్మడు ఉదయం 7గంటల సమయంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెనుకభాగంలో ఉన్న తన కళ్లంలో ఆవులకు మేత వేస్తుంది. ఆ సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చాడు. ఆమె వద్దకు వెళ్లి తన చేతిలో ఉన్న కారం ఆమె ముఖంపై చల్లి మెడలోని 38 గ్రాముల బంగారు పుస్తెలతాడును లాక్కున్నాడు. అప్రమత్తమైన ఆమె పెనుగులాడినప్పటికీ ప్రయోజనం లేక కేకలు వేసింది. ఆమె కేకలు విని అక్కడకు చేరుకున్న తన భర్త నరేంద్రతో పాటు మరికొంత మందికి విషయం చెప్పింది. వెంటనే పుస్తెలతాడు అపహరించుకుపోయిన వ్యక్తి రాజాం వైపు వెళ్తున్నాడని గమనించి వెంబడించినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే అప్రమత్తమైన సీఐ కె.అశోక్‌కుమార్ ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేయడంతో పాటు తన సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. సంఘటన జరిగిన ప్రాంతానికి దగ్గర్లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించడంతో పాటు గ్రామస్తుల వద్ద ఘటనకు సంబంధించి వివరాలు సేకరించారు.

చిరుద్యోగులపై కొనసాగుతున్న

కూటమి కుట్రలు!

- పెణసాం వీఓఏ తొలగింపు
- ఆమెను కొనసాగించాలని పొదుపుల సంఘాల తీర్మానం
- అయినా తొలగించిన వైనం
- మంత్రి కొండపల్లి ఇలాఖాలో తీరిది!



వెలుగు కార్యాలయం



సన్యాసమ్మను కొనసాగించాలని పెణసాం పొదుపు సంఘాల మహిళలు చేసిన తీర్మానం

గంట్యాడ: చిరుద్యోగులపై కూటమి కుట్రలు కొనసాగుతున్నాయి. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చిరుద్యోగుల తొలగింపే లక్ష్యంగా పని చేస్తున్నారు. ముఖ్యంగా మంత్రి కొండపల్లి ఇలాఖాలో కూటమి నేతలు రెచ్చిపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే పలువురు చిరుద్యోగులను తొలగించారు. కేజీబీవీల్లో పని చేసే కుక్, వాచ్‌మన్‌లను, పాఠశాలల్లో పని చేసే ఆయాలు, వాచ్‌మన్‌లు, ఉపాధి పథకంలో పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించారు. మండలంలో ఇప్పటికే 15 మంది వీఓఏలను తొలగించారు. తాజాగా పెణసాం వీఓఏ(గ్రామైఖ్య సంఘం సహాయకురాలు)ను కూడా తొలగించారు. పెణసాం గ్రామంలో ఇటీవల జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో కూడా కూటమి నేతలు పెద్ద రచ్చే చేశారు. పెణసాం వీఓఏ సుంకరి సన్యాసమ్మ(ఇందిర) గడిచిన 14 ఏళ్లుగా పని చేస్తుంది. ఇప్పుడు ఆమెను తొలగించి ఆ స్థానంలో వేరే మహిళను నియమించేందుకు కూటమి నేతలు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో గ్రామంలో ఉన్న పొదుపు సంఘాల అధ్యక్షులు అంతా ఒక్కటై సన్యాసమ్మ వీఓఏగా బాగానే పని చేస్తున్నారని, సంతృప్తికరంగా సేవలు అందిస్తుందని, ఆమెనే కొనసాగించాలని తీర్మానించారు. అయినా అధికారులు వారి అభిప్రాయాలను పట్టించుకోలేదు.

తొలగింపు ఉత్తర్వులు ఇవ్వరట..!

ఏదైనా ఉద్యోగిని విధుల నుంచి తొలిగిస్తే ఏ కారణం చేత తొలగిస్తున్నారో.. ఉత్తర్వులు ఇస్తారు. కానీ వెలుగు అధికారులు మాత్రం తొలగింపు ఉత్తర్వులు ఇవ్వలేమని చెబుతున్నారు. దీనిపై తీవ్రమైన విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తొలగింపు ఉత్తర్వులు ఉంటే న్యాయ పోరాటం చేసేందుకు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లేందుకు అవకాశం ఉంటుంది. అందుకే ఇలా చేస్తున్నారని చెబుతున్నారు.

వీఓఏను తొలగించాం..

పెణసాం వీఓఏను తొలగించాం. వీఓఏలను తొలగింపు ఉత్తర్వులు అంటూ ఏమీ ఇవ్వం. ఇది నిబంధనల మేరకే చేశాం.

– కోరుకొండ సులోచనదేవి, ఏపీఎం, వెలుగు

తొలగించాం.. రికార్డులివ్వమని చెప్పారు...



నేను 14 సంవత్సరాలుగా వీఓఏగా పని చేస్తున్నాను. పొదుపు సంఘాల మహిళల అందరికీ సంతృప్తికర సేవలు అందిస్తున్నాను. వెలుగు సీసీ నిన్ను తొలగించాం.. నీ స్థానంలో వేరొకరిని నియమిస్తాం.. రికార్డులు అప్పగించమని చెప్పారు. ఇలా తొలగిస్తే ఎలా జీవించేది.

– సుంకరి సన్యాసమ్మ, వీఓఏ, పెణసాం

ఉల్లాసంగా.. ఉత్సాహంగా...

- జిల్లా స్థాయి టెన్నిస్ టోర్నమెంట్ ప్రారంభం



జిల్లా స్థాయి టెన్నిస్ పోటీల్లో ఆడుతున్న క్రీడాకారులు

విజయనగరం: జిల్లా కేంద్రం వేదికగా జిల్లా స్థాయి టెన్నిస్ టోర్నమెంట్ ఉల్లాస భరిత వాతావరణంలో ప్రారంభమైంది. నగరంలోని సిటీ క్లబ్ ఆవరణలో అండర్ – 12, 16, 30 ప్లస్, 40 ప్లస్, 50 ప్లస్ వయస్సుల కేటగిరీల్లో శనివారం నిర్వహించిన పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 60 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. విజయనగరం సిటీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతి ప్రధానోత్సవం చేయనున్నారు. టెన్నిస్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఈ తరహా పోటీలను త్వరలో మరిన్ని నిర్వహిస్తామని నిర్వాహకులు రామారావు, రంగబాబు, వైభవ్ తెలిపారు. జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలను ఒకప్పుడు సిటీ క్లబ్ నిర్వహించిందని, ఎందరో అంతర్జాతీయ ఆటగాళ్లు సిటీ క్లబ్‌లో ఆడారని ఈ సందర్భంగా నిర్వాహకులు పేర్కొన్నారు. ఐదు విభాగాల్లో నిర్వహిస్తున్న పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు అన్ని వసతులు ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో టెన్నిస్ జాతీయ స్థాయి క్రీడాకారులు సన్యాసిరాజు, కోచ్ గౌరీశంకర్, నిర్వాహకులు సాత్విక్, కౌశిక్, సీనియర్ ప్లేయర్స్ ఈ పోటీలను ప్రారంభించారు.

రంగప్ప చెరువు వద్ద ఉద్రిక్తత

- భూ సాగుదారుల ఆందోళన



జేసీబీని అడ్డుకుంటూ నినాదాలు చేస్తున్న భూమి సాగుదారులు

రాజాం సిటీ: పట్టణ పరిధిలోని రంగప్ప చెరువు ఆధునికీకరణ పనుల్లో భాగంగా అధికారులు శనివారం చర్యలు చేపట్టారు. జేసీబీతో అక్కడ ఉన్న ఆక్రమణలను తొలగించే ప్రయత్నం చేశారు. ఈ విషయం తెలుసుకున్న సంబంధిత భూమిలో సాగుదారులు అక్కడకు చేరుకుని ఏళ్ల తరబడి తమ సాగులో ఉన్న భూములు లాక్కోవద్దంటూ ఆందోళనకు దిగారు. దీంతో ఒకింత ఉద్రిక్తత పరిస్థితులు చోటుచేసుకున్నాయి. అధికారులు చెరువు వద్ద ట్రించ్‌లు ఏర్పాటు చేస్తున్న జేసీబీకి అడ్డంగా నిలుచొని నినాదాలు చేశారు. ఈ విషయంపై ఇప్పటికే నోటీసులు అందించామని, ఇది ప్రభుత్వ భూమి అని, ఈ చెరువుకు ఆనుకుని ఆక్రమణకు గురైనట్లు గుర్తించామని అధికారులు చెప్పడంతో బాధితులు నిరసన తెలిపారు. 114 సర్వే నంబర్‌లో దళితులకు, స్వతంత్ర సమరయోధులకు పేరిట ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందని, దీంట్లో తాము సాగు చేసుకుంటున్నామని, పట్టాదారు పాసుపుస్తకాలు కూడా ఉన్నాయని, భూమి శిస్తు కూడా చెల్లిస్తున్నామని సాగుదారులు బి.అప్పారావు, ఎన్.ఆదియ్య, తవిటి నాయుడు, ఎన్.గడ్డియ్య, శంకర్ తదితరులు అధికారుల ఎదుట వాపోయారు. ఇప్పుడు అధికారులు ఇలా తమ భూమిని లాక్కోవడం సమంజసం కాదని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో 70 కుటుంబాల వారు రోడ్డున పడతామని, పేదల భూములను కాపాడాల్సిందిపోయి తమ పొట్ట కొట్టొద్దంటూ జేసీబీలను అడ్డుకున్నారు. దీంతో చేసేదిలేక భూమికి సంబంధించి సరైన పత్రాలను చూపాలని పేర్కొంటూ అక్కడ నుంచి వెనుదిరిగారు.

నగరంలో కేంద్ర బృందం పర్యటన



పీహెచ్‌సీ సిబ్బందితో కేంద్ర బృందం సభ్యులు

విజయనగరం: ప్రభుత్వం తరఫున ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీసేందుకు కేంద్ర బృందం నగరంలో శనివారం పర్యటించింది. నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్స్ కమిటీ సభ్యులైన డాక్టర్ గౌరవ్ త్రిపాఠి, సుదీప్ శుక్లాదాస్ రెండు రోజుల పర్యటన నిమిత్తం జిల్లాకు శనివారం విచ్చేశారు. జిల్లా కేంద్రంలో పలు ప్రాంతాల్లో పర్యటించారు. నగరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా అందుతున్న వైద్య సేవలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పీహెచ్‌సీలను తనిఖీ చేయడంతో పాటు హెల్త్ సెక్రటరీలు, ఏఎన్‌ఎంలు, ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వీటీ అగ్రహారంలో ఉన్న జొన్నగుడ్డి పీహెచ్‌సీకి చేరుకుని అక్కడ ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు, మందుల పరిస్థితి, వైద్య పరికరాల పనితీరు వంటి అంశాలను నిశితంగా పరిశీలించారు. అనంతరం 41వ నంబరు సచివాలయం చేరుకుని అక్కడ వివిధ అంశాలను, వైద్య పరమైన సేవలను ఏఎన్‌ఎంలను అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ బృందం సభ్యులు తమ పరిశీలన అంశాలను నమోదు చేసి పీహెచ్‌సీలకు ర్యాంకింగ్‌లు ఇవ్వనున్నారు. మరో వారం రోజుల్లో వేరొక బృందం రానున్నట్టు వైద్య సిబ్బంది తెలిపారు.

సాయి స్థూపం శంకుస్థాపన



పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

విజయనగరం టౌన్: కాశీవిశ్వేశ్వర సహిత శ్రీ షిర్డీ సాయి దక్షిణాభి ముఖ అభయాంజనేయస్వామి దేవాలయం వద్ద 40 అడుగుల సాయి స్థూపానికి శనివారం శంకుస్థాపన నిర్వహించారు. స్థానిక రీమాపేట ఉమామహేశ్వరనగర్‌లో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, షిర్డీసాయి సేవక్ సంఘ్ ఉప్పల బాపిరాజు దంపతులు కార్యక్రమంలో పాల్గొని పూజాధికాలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేవాలయం అభివృద్ధిలో భాగంగా తెలుగు రాష్ట్రాలలో తొలిసారిగా 40 అడుగుల సాయి స్థూపం నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. స్థూపంపై కలువ పువ్వులో ఆశీనులైన సాయి నిలువెత్తు విగ్రహం భక్తులను ఎంతగానో ఆకర్షిస్తుందన్నారు. ఈ సందర్భంగా సాయి భక్తులు రాసిన సాయినామకోటి పుస్తకాలను, నవధాన్యాలతో సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, సేవకులు పాల్గొన్నారు.

వేతనాలు ఇవ్వండి మహాప్రభో!



ఆందోళన చేస్తున్న వేతనదారులు

రామభద్రపురం: పని చేసినా పస్తులే.. అనేలా ఉపాధి హామీ పథకం వేతనదారుల పరిస్థితి తయారైంది. గత 10 వారాలుగా పనులకు వెళ్తున్నా వేతనాలు మాత్రం చెల్లించడం లేదని రామభద్రపురానికి చెందిన వేతనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రోజువారీ కూలి డబ్బులపై ఆధారపడే కుటుంబాలు ఆకలితో అలమటిస్తున్నామని పేర్కొంటున్నారు. నచ్చిన కూర వండుకుని ఇష్టంగా తిని చాలా రోజులైందని వాపోతున్నారు. ఓ వైపు ఎండలు మండిపోతున్నా.. మరోవైపు కడుపు మాడిపోతున్నా కష్టపడి పని చేస్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి దుస్థితి తాము చూడలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే ఇలా నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లో ఉండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తమ వేతనాలు అందివ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎర్రచెరువు ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న ఆర్ఐ కృష్ణమూర్తినాయుడు

తెర్లాం: మండలంలోని పెరుమాళి గ్రామంలో ఉన్న ఎర్రచెరువు ఆక్రమణలను రెవిన్యూ అధికారులు శనివారం తొలగించారు. తహసీల్దారు కార్యాలయంలో ఇటీవల జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి గ్రామానికి చెందిన పలువురు చెరువు ఆక్రమణలపై తహసీల్దారు హేమంత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆక్రమణలను పరిశీలించాల్సిందిగా ఆర్ఐ, వీఆర్వోలను తహసీల్దారు ఆదేశించారు. దీంతో వారు క్షేత్రస్థాయికి వెళ్లి ఆక్రమణకు గురైన ఎర్రచెరువును పరిశీలించి, చూడగా ఆక్రమణలు జరిగినట్లు నిర్ధారించి తహసీల్దార్‌కు విషయం తెలియజేశారు. దీంతో ఆయన ఆక్రమణలు తొలగించాలని ఆదేశించడంతో జేసీబీతో చెరువు గర్భంలోని ఆక్రమణలను తొలగించారు. ప్రభుత్వ భూములు గానీ చెరువు గర్భాలను గానీ ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణమూర్తినాయుడు, వీఆర్‌వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

శుభలేఖ ఇచ్చేందుకని బయలుదేరి..

మృత్యు ఒడిలోకి...

- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి
- మరొకరికి గాయాలు
- రాజుపేట వద్ద ఘటన



మృతుడు మోహనరావు (ఫైల్)



రాజుపేట వద్ద ప్రమాద ఘటన



మోహనరావును ఆసుపత్రికి తరలించే యత్నంలో యువత

పాలకొండ రూరల్: తన పెద్దనాన్న కుమారుడు వివాహం తొలి శుభలేఖను తమ ఇంట పేరంటాళ్లకు చూపించేందుకు వెళ్తూ జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. దీంతో మరో మూడు వారాల్లో ఆ ఇంట జరగాల్సిన వివాహ వేడుకలో విషాదం నెలకొంది. మృతుడి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళ్తే.. పాలకొండ మండలం కోటిపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయదారుడు గొర్ల కృష్ణ, భాను దంపతులకు ఓ కుమార్తెతో పాటు కుమారుడు మోహనరావు ఉన్నారు. కుమార్తెకు వివాహం కావడంతో కుమారుడిని తమ రెక్కల కష్టంతో చదివిస్తున్నారు. మోహనరావు పెద్దనాన్న కుమారుడికి మే 9వ తేదీన వివాహం నిశ్చయమైంది. దీంతో మోహనరావు అలియాస్ మణి(20) అన్నీ తానై వివాహ ఏర్పాట్లను చూస్తున్నాడు. ఇందులో భాగంగా పెండ్లి శుభలేఖను తొలిత పేరంటాళ్లకు, దేవతలకు చూపించి తరువాత బంధువులకు ఇచ్చేందుకు తన పెద్దనాన్న విశ్వేశ్వరరావుతో కలిసి శనివారం సిద్ధమయ్యాడు. తన బైక్‌పై పెద్దనాన్నతో కలిసి దుగ్గి – నక్కపేట వెళ్లేందుకు శనివారం ఉదయం 7.30 గంటలకు ఇంటి నుంచి బయలుదేరారు. ఈ క్రమంలో స్థానిక రాజుపేట ఖానాల దాటి వీరఘట్టం రోడ్డుకు తన బైక్‌ను తిప్పే సమయంలో వీరఘట్టం నుంచి సురేష్ స్కూల్‌కు చెందిన బస్సు ఢీకొంది. దీంతో బైక్ పైనుంచి మోహనరావుతో పాటు పెద్దనాన్న తుళ్లిపడ్డారు. ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న మోహనరావు తల, ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. స్పృహ కోల్పోయాడు. ఇంతలోనే తేరుకున్న పెద్దనాన్న విశ్వేశ్వరరావు కేకలు వేశాడు. స్థానికులు గుర్తించి 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. ఇంతలోనే అక్కడి యువకులు మోహనరావును ఆస్పత్రికి వేరొక బైక్‌పై తీసుకువెళ్లేందుకు ప్రయత్నించారు. ఇంతలో 108 వాహనం రావడంతో క్షతగాత్రులను స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మోహనరావు మృతి చెందినట్టు వైద్యులు గుర్తించారు. విశ్వేశ్వరరావు స్వల్ప గాయాలతో కోలుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ కె.ప్రయోగమూర్తి కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన స్కూల్ బస్సును స్టేషన్‌కు తరలించారు.

కోటిపల్లిలో విషాదం

మోహనరావు అలియాస్ మణి మృతితో కోటిపల్లిలో విషాదం నెలకొంది. పెళ్లి సందడితో ఉండాల్సిన ఆ ఇంట కన్నీటి రోదనలు వినిపిస్తున్నాయి. తమ ఒక్కగానొక్క కుమారుడిపై విధికి కన్ను కుట్టిందని తల్లిదండ్రులు కృష్ణ, భాను గుండెలవిసేలా రోదిస్తున్నారు. వీరి రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కొత్తవలస: మండలంలోని విజయనగరం – కొత్తవలస రోడ్డులో బలిఘట్టాం జంక్షన్ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గొల్లలపాలెం గ్రామానికి చెందిన సర్వసిద్ధి వినయ్‌కుమార్(30) అక్కడికక్కడే మృతి చెందాడు. దీనికి సంబంధించి సీఐ షణ్ముఖరావు తెలిపిన వివరాలు.. మృతుడు వినయ్‌కుమార్ ఎస్.కోట ఏరియా ఆసుపత్రిలో పని చేస్తున్నాడు. భీమాళి గ్రామంలో తన స్నేహితుడు మామిడి పళ్లు ఇస్తానని చెప్పడంతో వినయ్‌కుమార్ తన ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి తన స్వగ్రామం వస్తుండగా బలిఘట్టాం జంక్షన్ సమీపంలోకి వచ్చేసరికి వెనుక నుంచి అతివేగంగా లారీ వచ్చి ఢీకొట్టింది. దీంతో వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన లారీని అక్కడే వదిలేసి డ్రైవర్ పరారయ్యాడు. మృతుడు శరీరం గుర్తుపట్టలేనంతగా మారిపోయింది. మృతుడు భార్య ప్రస్తుతం నిండుగర్భిణి అని స్థానికులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ తెలిపారు.

మే 20న దేశ వ్యాప్త సమ్మె

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బారావమ్మ



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావమ్మ

పార్వతీపురం: దేశ వ్యాప్తంగా మే 20న తలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బారావమ్మ వెల్లడించారు. పట్టణంలోని సుందరయ్య భవనంలో శనివారం జరిగిన జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికులు హక్కులను కాపాడుకునేందుకు మళ్లీ పోరాటం చేయాలన్నారు. రానున్న మే డే రోజున పోరాట స్ఫూర్తిని రగిలించేలా ఘనంగా వేడుకలు నిర్వహించాలన్నారు. బీజేపీ ప్రభుత్వం కార్మికులకు రక్షణగా ఉన్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్‌లుగా మార్పు తీసుకురావడం కార్మికుల మెడకు ఉరితాడు లాంటిదన్నారు. కష్టపడే కార్మికులను కట్టుబానిసలుగా మార్చే ఈ చట్టాలకు వ్యతిరేకంగా కార్మికుల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర పద్ధతుల్లో విరివిగా ప్రచారం చేసి మే 20న చేపట్టే సమ్మెలో కార్మిక వర్గం మొత్తం పాల్గొనేలా చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు డి.రమణారావు, కార్యవర్గ సభ్యులు బీవీ రమణ, ఎన్వై నాయుడు, ఆర్.రాము, కె.సాంబమూర్తి, వి.ఇందిర పాల్గొన్నారు.

నోటిఫికేషన్ ఇచ్చారు...

పోస్టుల భర్తీ మరిచారు..!

- శిశుగృహ, బాలసదన్‌లలో పోస్టుల భర్తీకి 2024 సెప్టెంబర్‌లో నోటిఫికేషన్
- 23 పోస్టులకు 640 మంది అభ్యర్థులు దరఖాస్తు
- ఇప్పటికీ భర్తీ చేయని వైనం



స్త్రీ, శిశు సంక్షేమశాఖ కార్యాలయం

దరఖాస్తుల వివరాలు:

పోస్టు పేరు	దరఖాస్తుల సంఖ్య
డీసీపీయూ	129
డీఈఓ	218
సోషల్ వర్కర్	55
స్టోర్ కీపర్	107
కుక్	36
హౌస్‌కీపర్	12
నైట్‌వాచ్‌మెన్	17
ఎడ్యుకేటర్	28
మ్యూజిక్ టీచర్	25
యోగా టీచర్	13

విజయనగరం ఫోర్ట్: అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు లక్షలాది ఉద్యోగాలు కల్పిస్తామని గొప్పలు చెప్పిన కూటమి నేతలు... ఉన్న ఉద్యోగాలను ఊడగొడుతున్నారు. చిరుద్యోగులకు వేదన మిగుల్చుతున్నారు. మరోవైపు నోటిఫికేషన్ ఇచ్చిన పోస్టుల భర్తీలోనూ నెలల తరబడి జాప్యం చేస్తున్నారు. పోస్టులను భర్తీ చేస్తారా, లేదా అనే సందేహం వ్యక్తమవుతోంది. ఐసీడీఎస్ పరిధిలోని డీసీపీయూ, శిశుగృహ, చిల్డ్రన్ హోమ్‌లలో పోస్టుల భర్తీకి 2023 నవంబర్ 20వ తేదీన అప్పటి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. పోస్టుల భర్తీ ప్రక్రియ చేపడుతున్న తరుణంలో ఎన్నికలకోడ్ రావడంతో భర్తీ ప్రక్రియకు బ్రేక్ పడింది.

తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు పాత నోటిఫికేషన్‌ను రద్దుచేసి 2024 సెప్టెంబర్ 4న కొత్తగా 23 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చింది. ఇందులో కాంట్రాక్టు పద్ధతిన భర్తీచేసే పోస్టులు 5, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేసేవి 9, పార్ట్‌టైమ్ పోస్టులు 9 ఉన్నాయి. వీటికోసం 640 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరంతా పోస్టుల భర్తీకోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇదే అంశంపై ఐసీడీఎస్ పీడీ రుక్సానా సుల్తానా బేగం మాట్లాడుతూ కొద్ది రోజుల కిందటే పీడీగా బాధ్యతలు స్వీకరించానని, పోస్టుల భర్తీ ప్రక్రియపై ఆరా తీసి భర్తీకి చర్యలు తీసుకుంటానన్నారు.